క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: మల్కాపురం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని 11 కేవీ దుర్గానగర్,11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ఏకేసీకాలనీ,కె.కె.ఎల్ జీవీఎంసీ పంప్ హౌస్ ఏరియా,ఈఎస్ఐ ఆస్పత్రి,ఐఎంయూ, సీఈఎంఎస్,సింధియా జంక్షన్,పోస్ట్ ఆఫీస్ ఏరియాలకు.. దుర్గానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో దుర్గానగర్, ఏఎస్ఆర్ కాలనీ,జీఏ కాలనీ,ఎన్టీఆర్‌కాలనీ,టీడీపీ కాలనీ,అంబేడ్కర్‌కాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని పేర్కొన్నారు.

గోపాలపట్నం: పోలీస్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. దీని పరిధిలోని బాజీ జంక్షన్, రెడ్డివీధి, సుసర్ల కాలనీ, జయప్రకాష్‌నగర్, ఎస్సీ కాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, నాయుడు క్వార్టర్స్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రాంతినగర్‌లో అంధకారం



63వ వార్డు క్రాంతినగర్‌లో వీధిలైటు వెలగని స్తంభం

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరం సమీపంలో వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే తేలు, జెర్రిలు, పాములు తదితర విషకీటకాల సంచారం అధికంగా ఉంటుందని.. దీంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. పలుమార్లు విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులైనా స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాము కలకలం



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ నాగరాజు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని గౌరీపరమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గణపతి మందిరంలో ఆరడుగుల నాగ జెర్రి సంచారం కలకలం సృష్టించింది. ఆలయ ప్రాంగణంలో తిరుగుతుండడంతో చూసి పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే నాగరాజు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టడంతో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

అ‘పూర్వ’ కలయిక..



ఆత్మీయ కలయికలో 1974–75 బ్యాచ్

ఉక్కునగరం: వారంతా పరవాడ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు. 50 ఏళ్ల తర్వాత మొదటిసారిగా కలుసుకున్నారు. వారి ఆనందానికి అంతేలేదు. వయసు మరిచిపోయారు. ఆడిపాడి సందడి చేశారు. వారే 1974–75 పదో తరగతి బ్యాచ్. వేర్వేరు వృత్తుల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా బుధవారం స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లోని స్టీల్‌క్లబ్‌లో కలిశారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. 50 ఏళ్లలో జరిగిన విషయాలను పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, వారి పిల్లలు సాధించిన విజయాలు చెప్పుకుంటూ పొంగి పోయారు. నాటి ఉపాధ్యాయులు కావలి రామారావు, పైలా సన్యాసిరావులను దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పి.ఎస్.వి.వి.ఎస్.వి.పి.టి.ఎస్.ఆర్. కుమార్, పాపయ్య పాత్రుడు, ఎర్ని సత్యనారాయణలను తోటి విద్యార్థులు అభినందించారు. మధుర జ్ఞాపకాలతో తిరుగుపయనమయ్యారు.

పదిలో మెరిశారు

- 70 నుంచి 90 శాతం వరకూ ఉత్తీర్ణత
- గత ప్రభుత్వ సంస్కరణలతో మెరుగుపడిన ఫలితాలు

గోపాలపట్నం: పదోతరగతి ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చాటి ప్రభుత్వ పాఠశాలల కీర్తిని ఇనుమడింపజేశారు. గత ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా వసతులు కల్పించడంతో ఉత్తీర్ణత శాతం మెరుగుపడుతోందని విద్యార్థులు, తల్లి దండ్రులు చెబుతున్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ పదోతరగతిలో అత్యధికంగా పి. హర్ష వర్ధన్ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించాడు. ఈ స్కూల్ నుంచి 203 మంది పరీక్షలు రాయగా 142 మంది పాసయ్యారు. 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

◆ కొత్తపాలెం హైస్కూల్ నుంచి 50 మంది పరీక్షలు రాయగా 46 మంది పాసయ్యారు. అత్యధికంగా ముద్దాడ మహేశ్వరి 565 మార్కులు సాధించింది. మొత్తంగా 92 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

◆ గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 228 మంది పరీక్షలు రాయగా 189 మంది పాసయ్యారు. 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎల్లపు జాహ్నవి 585 మార్కులు సాధించింది. గ్రీష్మ 580, ధనుశ్రీ 578, గీతిక 575, సంతోషి 574, సుష్మిత 574 మార్కులు సాధించారు.



571 మార్కులు సాధించిన అరుణకు స్వీట్ తినిపిస్తున్న హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు



గోపాలపట్నం హైస్కూల్

◆ **యల్లపువా**నిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 66 మంది పరీక్షలు రాయగా 60 మంది పాసయ్యారు. ఇక్కడ అత్యధికంగా డి. మనీష 582 మార్కులు సాధించింది.

◆ మేహాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ కళాశాలలో పదోతరగతి విద్యార్థులు 75 మంది రాయగా 71 మంది పాసయ్యారు. 95 శాతం సాధించారు. ఈ స్కూల్‌లో ఎం. తేజశ్విని 542 మ్కాలు సాధించింది,

◆ ఎస్‌ఏడీ భాష్యం విద్యార్థులు విజయభేరి మోగించారు. జనపల భవ్యశ్రీ 591 మార్కులు సాధించింది. 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 84 మంది, 55 మార్కులకు పైగా సాధించిన వారు 167 మంది అని ప్రిన్సిపాల్ మణికంఠ రెడ్డి తెలిపారు.

మల్కాపురం: పదో తరగతి ఫలితాల్లో మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. గడిచిన నాలుగేళ్లుగా పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి జిల్లాలో పలు పాఠశాలలు మల్కాపురం జీవీఎంసీ పాఠశాల వైపు చూసే విధంగా పాఠశాల కీర్తిని పతాక స్థాయికి చేర్చుతున్నారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల చూపిన శ్రద్ధ వల్లే ఫలితాలు సాధ్యమయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు వివరిస్తున్నారు.



యల్లపు జాహ్నవి,585



అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మల్కాపురం హైస్కూల్ హెచ్‌ఎం అరుణకుమారి

219 మందికి 197 మంది ఉత్తీర్ణత

మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 219 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 112 మంది బాలురు,107 మంది బాలికలు. వీరిలో(ఇంగ్లిష్ మీడియం) 101 మంది బాలురు,96 మంది బాలికలు కలిపి మొత్తం 197 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 142 మంది ప్రథమ స్థానంలో నిలవగా, 35 మంది ద్వితీయ స్థానంలో, 20 మంది తృతీయ స్థానంలో నిలిచారు. వీరిలో కొయిలాడ రేఖ 589 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచారు. అలాగే మరిపన హేమలత 587,పైడి రాకేష్ 581 మార్కులు సాధించారు.చక్కటి మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అరుణకుమారి, ములగాడ మండల విద్యా అధికారి త్రినాథరావు, వెంకటేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి విద్యార్థులను అభినందించారు.

◆ 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో జి.కార్తికేయరెడ్డి 586 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకుంటున్నా అక్కడ నుంచి బలవంతంగా బయటకు వచ్చి పరీక్షలకు హాజరై 586 మార్కులు సాధించడంతో పలువురు అభినందించారు.



ఎం.హేమలత, 587



కె.రేఖ 589



పి.ప్రకాష్‌కుమార్, 581



జి.కార్తికేయరెడ్డి , 586

నేవీ అధికారి అవుతా...



హర్షవర్ధన్,590

నా తొలి ప్రాధాన్యం నేవీ అధికారి కావడం. తర్వాత ప్రాధాన్యం ఐపీఎస్ కావడం. హర్షవర్ధన్ చదువుతో పాటు ఆటల్లో కూడా మేటిగా నిలుస్తున్నాడు. ఇటీవల ఫుట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయిపోటీల్లో పాల్గొన్నాడు. నేవీ అధికారి అయి దేశానికి సేవచేస్తా.

–హర్ష వర్ధన్, గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్

బాలికలదే పై చేయి



మెరిట్ విద్యార్థులతో గాంధీ గ్రామం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీగ్రామం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి 58 మంది పరీక్షలు రాశారు. వీరిలో 48 మంది ఉత్తీర్ణత సాధించగా 10 మంది ఫెయిలయ్యారు. అయితే 36 మంది ప్రథమశ్రేణిలో, 10 మంది ద్వితీయ శ్రేణిలో, 02 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు.. 561 మార్కులతో లంబోధర్ స్వైయిన్ టాపర్‌గా నిలిచాడు. ఇక 553 మార్కులతో జోసెఫ్ ద్వితీయ స్థానాన్ని, 552 మార్కులతో చైతన్యకుమార్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది 90 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

ఆర్పీపేటలో 67 శాతం ఫలితాలు

కంచరపాలెం: జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో163 మంది పరీక్షలకు హాజరు కాగా 109 మంది ఉత్తీర్ణత సాధించారు. 67 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది 500 మార్కులకు పైగా 14 మంది విద్యార్థులు సాధించారు. దేవులపల్లి అరుణ 571, తోట గౌతమ్ 566, ఎస్.సిద్ధూ 557, వై.భువన్ 555, జి.శ్రావణి 552, ఎం.నవ్యశ్రీ 541, కాకినాడ కీర్తి 539, కె.సిద్ధూ 538, బి.కేశిని 535, ఎం. హారిక 518, జగదీష్ 516, శ్రావణ్‌కుమార్ 515 ఆర్.జ్యోత్స్న భవాని 514, ఎస్.మధుశాలిని 504 మార్కులు సాధించారు.

కాంట్రాక్ట్ వర్కర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్‌ఎస్‌ఎల్) సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ ఇండియా మిషన్ పథకంలో భాగంగా సంస్థలో పనిచేస్తున్న సుమారు 2 వేల మంది కాంట్రాక్ట్ వర్కర్లకు వృత్తి నైపుణ్యం పెంచడానికి క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ అండ్ కంప్‌లైయెన్స్ నాలెడ్జ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని షిప్ బిల్డింగ్ టెక్నాలజీలో బుధవారం ప్రారంభించారు. షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ శ్రమను పెట్టుబడిగా పెట్టడం ద్వారా ఓడల నిర్మాణ నాణ్యతను మెరుగుపరుస్తున్నారని, వృత్తిపరమైన వృద్ధి సాధిస్తున్నారని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి అన్నారు.



శిక్షణలో పాల్గొన్న కాంట్రాక్ట్ వర్కర్లు

షిప్ బిల్డింగ్ డైరెక్టర్ కెప్టెన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని శిక్షణ కార్యక్రమాన్ని రెండు భాషల్లో ప్రముఖ నిపుణులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

గోపాలపట్నం: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి చాలా దారుణమని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మృతులకు సంతాపం తెలుపుతూ బుధవారం సాయంత్రం గోపాలపట్నం హైస్కూల్ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మృతులకు నివాళులర్పించారు. చాలా మందిని వెంటాడి కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. టెర్రరిస్టులకు ఎన్డీఏ ప్రభుత్వం తగిన విధంగా బుద్ధి చెబుతుందన్నారు. విశాఖ వాసి చంద్రమౌళి ఆత్మకు శాంతికలగాలని నివాళులర్పించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, బొడ్డేటి విజయ్, నారిపిన్ని సత్తిరాజు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, మూర్తి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు చేయాలి

- కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలి
- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్
- 1475వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం పార్లమెంటులో ప్రకటించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి .పద్మ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపి, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1475వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నిందన్నారు. ఈ కుట్రను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ డబ్బును ప్లాంట్ ఉత్పత్తికి, యంత్రాలకు, ముడి సరకులకు, కార్మికుల జీతభత్యాలకు చెల్లించకుండా రూ.1140 కోట్లు బ్యాంకు అప్పులు చెల్లించారని తెలిపారు. ఇందులోనే రూ. 500 కోట్ల రూపాయలు జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని, రూ.6700 కోట్లు ఇతర అప్పులు తీర్చగా మిగిలింది 3 వేల కోట్లు అని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌లో 1100 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపుతున్నారని, కాంట్రాక్ట్ కార్మికులను 5400 మందిని తొలగించేందుకు సిద్ధపడ్డారని అన్నారు. ఇప్పటికే 960 మంది పాసులు రెన్యువల్ చేయకుండా, విధులకు హాజరు కాకుండా నిలిపి వేశారని తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ విధుల్లో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ తదితరులు

ముఖ్యమంత్రికి ప్లాంట్‌పై ఉన్న ప్రేమ ఇదేనా?

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, అనకాపల్లి జిల్లాలో ఇంకా నిర్మాణం కాని ఆర్సెలర్ మిట్టల్ కంపెనీకి సొంత గనులు కేటాయించమని మోదీని రాష్ట్ర ముఖ్యమంత్రి అడగడం చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పై ఆయనకు ఉన్న ప్రేమ అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. 8500 మంది నిర్వాసితులందరికీ తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె.మణి, కె.కుమారి, బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, ఎల్.కామేశ్వరి, స్వర్ణలత, పి.శారద, సింహాద్రప్పడు మాస్టారు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పోలీసులు తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇది అందుబాటులోకి వస్తే దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి పోయే ప్రయాణికులకు తిప్పలు తప్పనున్నాయి. ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని దువ్వాడ రైల్వేయూజర్స్ అసోసియేషన్, ప్రజా సంఘాలు కొన్నేళ్లుగా కోరుతున్నాయి. ఈ మేరకు రెండు నెలల కిందట దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. స్పందించిన తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద నిలిపిన ఆటోలు

సురక్షితం.. డబ్బు ఆదా

ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ అందుబాటులో లేకపోవడంతో రాత్రి వేళల్లో కొంతమంది ఆటోవాలాలు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రీపెయిడ్ స్టాండ్ అందుబాటులోకి వస్తే ఆటోల వివరాలు పోలీసుల వద్ద ఉంటాయి. నిర్దేశించిన ఆటో చార్జీలతోపాటు సురక్షితమైన ప్రయాణానికి వీలుంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఆరిలోవ: మే 10, 11 తేదీల్లో నగరంలోని మురళీనగర్‌లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ రెహమాన్ మాట్లాడుతూ సీపీఐ మహాసభలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నగరం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ఎంతో విలువైన భూములను కాపాడడానికి సీపీఐ పోరాటాలు చేస్తోందని చెప్పారు. సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరిలోవ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను నియమించి, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

- వడగాడ్పులతో జనం ఉక్కిరి బిక్కిరి



భగభగ మండినా తప్పదు ప్రయాణం

మల్కాపురం: ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచే భానుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటలు దాటిన తర్వాత భానుడు ప్రతాపం చూపుతూ జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు. వేడి గాలులు,ఉక్క పోత,తీవ్ర ఎండతో రోడ్లపైకి వచ్చే జనం విలవిల్లాడుతున్నారు. కొంత మంది ఎండ వేడికి తట్టుకోలేక చాలా మంది ఇంటికే పరిమితమవుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచే సూరీడు సుర్రుమన్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చే వాహనదారులు, పాదచారులు గొడుగోలు, తలపై వస్త్రం పెట్టుకుని రాకపోకలు సాగించారు. ఏప్రిల్ నెలలో ఇంత వేడి ఉంటే,మే,జూన్ నెలలో ఎండలు ఇంకెలా ఉంటాయో అని జనం కలవరం చెందుతున్నారు. సేవా మార్గాల్లో మజ్జిగ, మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఎండ వేడిని తట్టుకోలేక నెత్తిన టవల్‌తో...

జీవీఎంసీ ఆదాయానికి గండి!

- అనధికారికంగా వ్యాపారాలు
- పట్టించుకోని అధికారులు

మల్కాపురం: షాపింగ్ కాంప్లెక్స్ ఖాళీ.. ఆవరణలో రద్దీ.. ఇదీ మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనకు జీవీఎంసీ నిర్మించిన మార్కెట్ పరిస్థితి. కొంత మంది వ్యాపారులు సేవా మార్గాలకు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేసి అటు పాదచారులకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా జీవీఎంసీకి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ వ్యవహారం అంతా జీవీఎంసీ అధికారులకు తెలిసినా వారు పట్టనట్టు వ్యవహరించడంతో పలువురు పలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

గుల్లలపాలెంలో జీవీఎంసీ అధికారులు మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ పేరిట సుమారు 30 షాపులు నిర్మించారు.వీటిని కొన్ని వేలంలో పలువురు వ్యాపారులకు ఇచ్చారు. మరి కొన్ని ఖాళీగా ఉన్నాయి. అయితే షాపింగ్ కాంప్లెక్స్ ముఖద్వారాన్ని ఆనుకుని చేపల మార్కెట్‌కు వెళ్లే మార్గంలో అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. అంతటితో ఆగకుండా చేపల మార్కెట్‌కు వెళ్లే దారి (సేవా మార్గం)ని పూర్తిగా కప్పేసే విధంగా ముందుకు వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు.రక్షణ గోడకు ఆనుకుని షెడ్లు దర్జాగా ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు కలుగజేస్తున్నారు. దీంతో కూరగాయలు,చేపలు,మాంసం కొనుగోలు చేసేందుకు వచ్చే కొనుగోలుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాదు ఇక్కడ షాపును అద్దెకు తీసుకుంటే రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకు జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. అదే రక్షణ గోడను ఆనుకుని వ్యాపారాలు సాగిస్తే ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం ఉండదని భావించి కొందరు ఏళ్ల తరబడి తమ వ్యాపారాలు సాగిస్తున్నారు.



షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో షెడ్లు వేసుకుని వ్యాపారాలు సాగిస్తున్న వైనం



ఖాళీగా ఉన్న జీవీఎంసీ షాపులు



అనధికారికంగా వ్యాపారాలు సాగించడంతో ఇబ్బందులు ఇలా..

నేటి నుంచి ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో వైద్య శిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమీప మెడ్‌టెక్ క్యాంపస్‌లోని మాధవబాగ్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో సెక్టార్–9లోని ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ప్రారంభించనున్నారు. ఈ నెల 29 వరకు ఉదయం 9 గంటల సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న శిబిరంలో కంప్యూటరైజ్ స్ట్రెస్ టెస్ట్, పంచకర్మ, ఈసీజీ, బీఎంఐ, హార్ట్‌రేట్, బ్లడ్ ప్రజర్, ఆర్‌బీఎస్, ఐ చెకప్ చేయనున్నారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోం చేసుకోవాలని ఆయుర్వేద హాస్పటల్ ప్రతినిధులు కోరారు.

నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

అక్కిరెడ్డిపాలెం: ఇంటర్ బైపీసీ 2024లో పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ పారా మెడికల్, నర్సింగ్, బీపీటీ,ఎంఎల్ టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 26 వరకు అవకాశం ఉందన్నారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగ అవకాశం కల్పించి, ఫీజును జీతం నుంచి మినహా ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26న లోగా 7995013421, 7995013422 నంబర్లకు కాల్ చేయాలని కోరారు.